# గుభేళ్ళు

భానుమతీ రామకృష్ణ

శ్రీరాములు చాలా పసుగుడు మనిషి.

అసలు ఆకారమే బక్కచిక్కి చవితి చంద్రుడిలాగా గోరుచిక్కుడు కాయ వరుగులాగా వెదురుబద్దలా సన్నగా వుంటాడు. అందరం ఎప్పుడూ శ్రీరాముల్ని 'గుభేళ్లు' వస్తున్నాడని ఎగతాళి చేస్తుంటాం అతన్ని చూడగానే.

పాలిటిక్స్ దగ్గర్నుంచి 'సైకిలాబ్' అలజడిదాకా కనిపించిన న్యూస్‌పేపరు 'కట్టింగ్స్' అన్నీ తీసి పిచ్చివాడిలా ప్యాంటు జేబుల్లో పెట్టుకొని తిరుగుతుంటాడు....

అతని చాదస్తం ఎంతవరకంటే తన కిష్టమైన పాలిటీషియన్స్‌ని అవతలివాళ్లు యిష్టపడకపోతే వాళ్ళతో దెబ్బలాట పెట్టుకొని, కోప్పడి, అన్నం మానేసి మరి కాస్త చిక్కిపోతుంటాడు....

'సైకిలాబ్' తిరుగుతోందని తెలిసినప్పట్నుంచీ శ్రీరాములుకి నిద్రాహారాలు లేవు.... ఒకే 'ఎక్సయిట్‌మెంట్.' హడావిడిగా అన్ని పేపర్లూ కొని 'సైకిలాబ్' న్యూస్ కత్తిరించి జేబులనిండా తురుక్కుని, అడిగినవాళ్ళకీ అడగనివాళ్ళకీ ఆ 'సైకిలాబ్' బరువు, విస్తీర్ణం, అది భూమ్మీద పడే వేగం, దాని వేడి నిప్పు కంటే ఎన్నివేల రెట్లు ఎక్కువో చెప్పి చాలా ధైర్యస్తుల్ని కూడా అధైర్య పరిచి, చివరికి "మన చేతుల్లో ఏముంది! ఒదిలెయ్యాల్సిందే, విచారించి లాభం లేదు." అని ఆకాశంసేపు చేయి చూపి పెదిమ విరిచేవాడు విరక్తిగా....

అది చూసి అందరి ముఖాలూ భయంతో, దిగుల్తో కళాకాంతులు లేకుండా ముడుచుకుపోవడం శ్రీరాములికి కాస్త తృప్తి కలిగించేది. అలాంటి సమయంలో భయపడుతున్నవాళ్ళకి ఎవరైనా ధైర్యం చెప్పబోతే వాళ్ళతో దెబ్బలాట పెట్టుకునేవాడు– "ఏం తెలిసి వాళ్ళకు ధైర్యం చెబుతావు! సైకిలాబ్ సంగతి నీకు తెలూసా!" అంటూ మళ్ళీ జేబుల్లోంచి పేపర్ కట్టింగ్స్ తీసి అన్నీ వివరంగా చదివి, యింకెవరైనా ఆవేపు పోతూంటే వాళ్ళని గూడా కేకేసి పిల్చి 'సైకిలాబ్' బరువు, వేడి, అది వచ్చి పడబోయే వేగం, అంతా కంఠస్థంగా చెప్పి, మధ్యాహ్నం అన్నం తినాల్సిన మాట గూడా మరిచిపోయి 'సైకిలాబ్' ఎక్కడ పడుతుందో, జనం ఏమవుతారో, అది ఎక్కడ పడితే బాగుంటుందో తనలో తాను మాట్లాడుకుంటూ, మధ్య మధ్య ఆకాశంవేపు చూసి పెదిమ విరిచి మెల్లగా నడిచి వెళ్ళేవాడు.....

శ్రీరాములు ఎంత వేదాంతిగా కనిపిస్తాడో అంత పిరికివాడు.

అందర్నీ యింట్లోంచి బయటికి రావద్దనీ, ముఖ్యమైన పనులేమైనా ఉంటే 'సైకిలాబ్' పడ్డ తర్వాత చూసుకోవచ్చని సలహా యిచ్చి, ముఖ్యంగా అందరూ రెండంతస్తుల మేడ కిందభాగంలోనే వెళ్ళి తలదాచుకోవాలని పేపర్లో వేసిన విషయం మళ్ళీ కటింగ్స్ తీసి చూపించాడు. యింట్లోంచి ఎవరూ బయటికి రావద్దన్నాడు.


శ్రీరాముల్ని చూసి అందరూ ఒకే నవ్వు. అతను కనిపిస్తే అదుగో 'సైకిలాబ్' వస్తున్నాడు అని గోలగా ఎగతాళిచేయటం మొదలెట్టాం.

శ్రీరాములు వుండే యిల్లు కొత్తగా కట్టిన 'బ్లాక్ సిస్టమ్' బిల్డింగ్స్‌లో కింద భాగంలో వుంది.

మొదట పైభాగం కావాలని ఎంతో విశ్వప్రయత్నం చేశాడు. కొత్తగా బ్లాక్‌కి అడ్వాన్స్ ఇచ్చినప్పుడు రెండో అంతస్తులో కావాలనే యిచ్చాడు. కాని వాళ్ళు 'అలాట్' చేసింది మార్చం అన్నారు —

శ్రీరాములు అయిష్టంగానే చుట్టూ గుడిసెల మధ్యలో వున్న బిల్డింగ్ కింద భాగంలో గృహప్రవేశం చేశాడు. శ్రీరాములు గృహప్రవేశం చేసిన పదిరోజులకే మద్రాసులో గాలివాన రావడం దివి తాలూకా భువిలో కలిసిపోవడంతో బాటు, వూర్లో వుండే సెప్టిక్ టాంక్‌లన్నీ ఒకటిగా మద్రాసులోని కూమ్ రివర్‌లో కలిసి పక్కనే అడ్డంగావున్న శ్రీరాములు యింట్లోంచి వెల్లువ దూసుకొని పోవడంతో, అసలే సన్నగా వెదురుబద్దలా వంగి చవితి చంద్రుడి ఆకారంలోవున్న అర్భకుడు శ్రీరాములూ అతనికి తగిన సన్నజాజితీగలాంటిసన్నటి భార్యామణీ, అర్ధరాత్రి ప్రళయంలా వచ్చిన ఆ ప్రవాహంలో యీదుకుంటూ ఎలాగో బయటపడేసరికి పైవాళ్ళు చాంతాడేసి యిద్దర్నీ మేడమీదికి లాగేశారు.

శ్రీరాములు బాధ ఆరోజు మద్రాసులో అలాంటి తుఫాను వస్తుందని పేపర్లో వివరంగా వేసిన 'పేపర్ కటింగ్స్' ఎక్కడో నీళ్ళలో కొట్టుకుపోయింది. పని తొందర్లో ఆ పేపర్ కట్టింగ్ జేబులో పెట్టుకోవడం మర్చిపోయాడు. కొత్తగా కొన్న ఆవాలూ, ధనియాలూ,



పప్పూ, ఉప్పూ నీళ్ళల్లో కొట్టుకుపోయాయి కాఫీ పొడీ చక్కెరా గూడా నీటిపాలయిపోయాయని శ్రీరాములు భార్య నాంచారు ఏడుపు....

పైవాళ్లు కాఫీ యిచ్చినా, వాళ్ళిద్దరికీ రుచించలేదు.....పైగా మేడమీద వాళ్ళని చూస్తే యీర్ష్య పట్టుకొంది. ఎంచక్కా మేడమీద భాగం దొరికినట్లయితే యీ మురికినీళ్ళ వెల్లువ అసహ్యంగా యింటినిండా కొట్టుకురావడం, యీ నష్టం, కష్టం అన్నీ తప్పేవి గదా!....

ఆ కింది భాగం బ్లాక్ అలాట్ చేసిన ఆఫీసర్నీ పైభాగానికి మార్పించమని ఎంత బ్రతిమాలినా మార్చడానికి ఒప్పుకోనన్న మరో ఆఫీసర్నీ శ్రీరాములూ, నాంచారూ చచ్చేట్లు తిట్టిపోశారు.

ఆ రాత్రంతా జాగారంచేసి మర్నాడు నీళ్ళు తగ్గడం ప్రారంభించినా గూడా ఆ మురికినీళ్ళ కంపుకి తట్టుకోలేక ఎలాగో టాక్సీ చేసుకొని మా యింటికి వచ్చేశారు....ఆ కింద పోర్షన్ మాకు వద్దు మార్పించమని ఆఫీసర్ని బ్రతిమాలామనీ మార్పించలేదనీ మళ్ళీ ఆఫీసర్ని మా దగ్గరా తిట్టిపోశారు.

'స్కైలాబ్' డేంజర్ నుండి తప్పించుకోడానికి రెండంతస్తుల మేడ కిందిభాగంలోనే వుండాలని పేపర్స్‌లో రాగానే శ్రీరాములు ఆనందానికి అంతులేదు!....

భగవంతుడు తననూ, తన భార్యనూ 'స్కైలాబ్' బారినుండి రక్షించడానికే కాబోలు దివి తాలూకా మునిగిపోయినా మద్రాసులో మురికికాలవలన్నీ ఏకమై తన యింట్లోకి కొట్టుకువచ్చినా తన క్షేమంగోరే దేవుడు యిల్లు మార్పించనివ్వలేదు....

శ్రీరాములు 'స్కైలాబ్' గురించి సేకరించిన పేపర్ కట్టింగ్స్ చదివి అందర్నీ ఖంగారు పెడుతున్నా యీషన్మాత్రం ఖంగారుపడకుండా అందర్నీ 'జాగ్రత్తగా వుండండి! ముఖ్యంగా పై అంతస్తులో వుండకండి!....ఏ క్షణంలో అది వచ్చి పడుతుందో తెలీదు!....' అని హెచ్చరిక చేస్తూ ముసిముసి నవ్వుల్తో తిరుగుతున్నాడు....

'స్కైలాబ్' ఇంకా రెండు మూడు రోజుల్లో పడుతుందనగా శ్రీరాములు చాలా బిజీగా తిరగడం మొదలెట్టాడు... స్కైలాబ్ పడేరోజు తప్ప ముందుగా పడడానికి ఏమాత్రం వీల్లేదని అతని నమ్మకం— ఆ రోజు తనూ తన భార్యా యిల్లు వదిలి బయటికి రామని ఖచ్చితంగా చెప్పేస్తూ మా అత్తగారు ఒకనాడు అన్నమాటలు గుర్తుచేశాడు సడన్‌గా శ్రీరాములు!....ఆ మాటలు అతని జేబులోవున్న చిన్న డైరీ తీసి చదివాడు .... శ్రీరాములు జేబుల్నిండా ఏనాటివో పాత డైరీలూ న్యూస్‌పేపర్ కట్టింగ్స్ ఎప్పుడూ ఫుల్‌గా ఉంటాయి...

పందొమ్మిదివందల డెబ్భైమూడులో అమెరికావాళ్ళు స్కైలాబ్ వదిలినప్పుడు వ్రాసిపెట్టుకున్నాడు. ఆ రోజు పేపర్ చదివి శ్రీరాములు మా అత్తగారితో చెప్పినప్పుడు ఆమె ఏమన్నదో తు. చ. తప్పకుండా వ్రాసిపెట్టుకున్నాడు డైరీలో.

మా అత్తగారు శ్రీరాముల్ని ముద్దుగా 'శ్రీతా' అని పిలుస్తారు.... "అదిగాదురా శ్రీతా యీ యింగ్లీషువాళ్ళు 'శాట్‌లైట్లనీ, స్పుట్‌నిక్కులనీ అట్లా ఆకాశంలోకి వదుల్తున్నారే అవి ధనుంజయ వాయువల్లే తిరిగి తిరిగి ఏరోజన్నా వాళ్ళ నెత్తిమీదే పడితే ఆ సన్యాసులు ఏంచేస్తారు!....వీళ్ళ సైన్స్ మండిపోను! వాటికి తగలేసే డబ్బు మన ముఖాన పారేసి బీడుభూముల్ని దున్నించి నీటి సదుపాయం చేసినా బాగుండును మన దేశంలో!...." అని ఆవిడ అన్న

మాటలు చదివాడు పాతడైరీలోంచి।.... నిజమే। నాకూ గుర్తొచ్చినాయి ఆమె అన్నమాటలు। ....

శ్రీరాములు మా అత్తగారి భక్తుడు। ఆమె శిష్యపరమాణువుల్లో ప్రథముడు.

మా అత్తగారికి సాధారణంగా ఆరోగ్యంగా కాస్త కండగల ఒళ్ళున్న వాళ్ళని చూస్తే ఒళ్లు మంట।....

వీళ్ళకేం దుక్కల్లా వున్నారు।.... పాపం సన్నటివాళ్లు బలహీనులు. వాళ్ళ యందు జాలి విధిగా చూపడం అవసర మని ఆమె అభిప్రాయమో ఏమో।.... ఆమె అభిమానం చూరగొన్నవాళ్ళందరూ సన్నటివాళ్ళే।....లావాటి వాళ్ళని ఆవిడ కాస్త కొర కొర చూడటం నాకూ తెలుసు।....ఆ పడే స్కైలాబ్ మన నెత్తిన ఎందుకు పడకూడదు। అని శ్రీరాములు వేసిన ఎదురు ప్రశ్నకు ఆనాడు మా అత్తగారు అన్న కొన్ని ఆణిముత్యాల్లాంటి మాటలు 'పేరల్స్ ఆఫ్ విజ్‌డమ్' లాగా డైరీలో నోట్ చేసుకున్నాడు....

"మనదేశంలో అలాంటి పాపిష్టి యంత్రాలు పడవురా।"ఏం। ఎందుకని।" శ్రీరాములు అడిగాడు।

"మనదేశంనిండా దేవాలయాలున్నాయి ఎలా పడుతుందిరా। బదిరీ, కాశీ, రామేశ్వరందాకా యింతమంది దేవుళ్లుండి మనదేశంలో పడనిస్తారా .... పక్కకి తోసేస్తారు।...." అన్న మా అత్తగారి మాటలు చదువుతూ చివర "ఏమిట్రా శ్రీశా। అసలే అర్భకుడివి। రాను రాను మరీ బక్కచిక్కి వెదురుబద్దలా వంగి పోతున్నావు। కాస్త బలంపట్టే ఆహారం తినరా।" అని ఆమె అన్న మాటలు గూడా నోట్ చేశాడు.

ఆనాడు మేమంతా నవ్వుకున్నాం అతని చాదస్తానికి. ప్రతిదీ డైరీలో వ్రాసు కుంటాడని — అందుకు మా అత్తగారు



మమ్మల్ని మందలిస్తూ అలా ప్రతిదీ డైరీలో నోట్ చేసుకోడం ఎంతమంచిదో చెప్పి శ్రీరాముల్ని సమర్థిస్తూ మాకు గుభేళ్ల కథ చెప్పారు....

ఒక వూర్లో ఒక పిచ్చివాడుండే వాడట. పగలంతా నిద్రపోయి రాత్రుళ్లు మాత్రం మేలుకొని డైరీ ఒకటి జేబులో పెట్టుకొని వూరంతా పిచ్చిగా ప్రతి వీధీ తిరుగుతూ, ఏ చిన్న చప్పుడైనా ఆ చప్పుడు ఎక్కడనుంచి ఏవైపునుంచి వినిపించిందో తక్షణం డైరీలో నోట్ చేసుకునేవాడట. ఆ విషయం ఆ ఊర్లో అందరికీ తెలుసుట....

ఒకరోజు ఒక ధనవంతుల యింట్లో దొంగలు పడి యినప్పెట్టెలో వున్న సొమ్ములూ, డబ్బూ అంతా పెట్టెల్లో దోచుకొనిపోయారట।....పోలీసులు ఆ దొంగల ఆచూకీకోసం తీవ్రంగా వూరంతా గాలించడం మొదలెట్టారట। ఎక్కడా వాళ్ళజాడ దొరకలేదు।సడన్‌గా ఆ వెతికేవాళ్ళల్లో ఒకడికి రాత్రుళ్లు వీధులు తిరిగే ఆ పిచ్చివాడి డైరీ విషయం గుర్తొచ్చి వెళ్ళి పట్టుకున్నారట. డైరీ తీసి ముందురోజు రాత్రి ఏం వ్రాశాడో చూస్తే "లక్షాధికారి భగవాన్‌దాసుగారి ఇంట్లో రాత్రి రెండు గంటలకు మూడు గుభేళ్లు వినిపించాయి" అని వ్రాసి వుంది....పోలీసులకి అంతా అర్థమైంది- వెంటనే భగవాన్‌దాసుగారింటికి పోలీసులు పరుగెత్తారు. పెరట్లో వున్న పెద్దబావిలోకి ముగ్గుర్ని దింపారు. నగలూ డబ్బూ పెట్టెలూ ఆ బావిలో దొరికాయి।....

వాళ్ళు పెట్టెల్తో పారిపోతూంటే యింటివాళ్లు లేచారు! పట్టుబడకుండా బావిలో పడేసి పారిపోయారు తర్వాత తీసుకోవచ్చని! పోలీసులకి పిచ్చివాడి డైరీ ఎంతో సహకరించింది! భగవాన్ దాసు డబ్బూ దొరికింది!.... అసలు వాడు పిచ్చివాడు కాడు. వాడు పిచ్చివాడు అని అనుకొనేవాళ్ళే పిచ్చివాళ్ళు!.... అని మా అత్తగారు చెప్పిన ఆ కథంతా గూడా నోట్ చేశాడు శ్రీరాములు! అప్పట్నుంచీ అతన్ని 'గుభేళ్లు' వస్తున్నాడు అని గోలచేసేవాళ్ళం. 'స్కైలాబ్' గొడవ ఆరంభం అయింతర్వాత 'స్కైలాబ్' వస్తున్నాడు. అనడం అలవాటయింది.

స్కైలాబ్ పడనే పడ్డది! వార్తలు రాత్రి చదివారు....మర్నాడు శ్రీరాములు చేతిలో కర్రతో రెండో చేత్తో నడుం పట్టుకొని బాధతో వంగి నడుస్తూ వచ్చాడు!....

"ఏమిటయ్యా! స్కైలాబ్ నీ నడుం మీదే పడ్డదా ఏం!" అందరం ఒకేసారి అడిగాం!—

"లేదయ్యా! ఎందుకయినా మంచిదని మరి కాస్త ఎక్స్ట్రా జాగ్రత్త తీసుకోడం మంచిదని పోయి మా గ్యాస్‌పొయ్యి పెట్టిన శ్లాబ్‌కింద కాస్త చోటుంటే నేనూ మా ఆవిడా ఆ రాత్రంతా ముడుచుకుని కూర్చున్నాం!

"స్కైలాబ్ పడ్డట్టు రేడియో వార్త వచ్చాక బయటికి రాబోతే నడుం లేవలా! యిప్పుడింకా నయం! యిదుగో స్కైలాబ్ పడ్డచోటు ఆస్ట్రేలియాలో... చూశారా!" అంటూ జేబులోంచి న్యూస్‌పేపర్ కట్టింగ్ తీశాడు 'గుభేళ్ళు!....'

